క్లుప్తంగా

తెగుళ్ల నివారణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో

దండేపల్లి: వరిపంటను ఆశిస్తున్న ఆకుముడత, సుడిదోమ, ఎండుతెగులు నివారణకు రైతులు తగిన మందులు పిచికారీ చేయాలని ఏఈవో రజిత సూచించారు. మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆకుముడత నివారణకు పెరమిత్రిన్, సుడిదోమ నివారణకు పైమెట్రోజన్, ఎండు తెగులుకు ప్లాంటమైసిన్ మందులను పిచికారీ చేయాలని సూచించారు. ఏయే మోతాదులో, ఎంత మేర పిచికారీ చేయాలో వివరించారు. రైతులు పాల్గొన్నారు.

పట్టణ అధ్యక్షుడిగా బోడంకి మహేష్



నియామకపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

పాతమంచిర్యాల: పట్టణంలోని సాయిరాంనగర్‌లో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షుడిగా బోడంకి మహేష్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ ఉత్తర్వులు అందజేశారు. బీసీలు సంఘటితంగా ఉద్యమించాలని, రిజర్వేషన్ల సాధనే ధ్యేయంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వంగల దయానంద్, గజ్జెల్లి వెంకటయ్య, బోరే శేఖర్, అనపర్తి శ్రేయ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఈఏఎస్ పరీక్ష



వెల్గనూర్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

దండేపల్లి: విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు 3, 6, 9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ఎస్ఈఏఎస్ పరీక్ష దండేపల్లి మండలంలో ప్రశాంతంగా జరిగింది. మండలంలో ఎంపిక చేయబడిన 22పాఠశాలలకు చెందిన 605మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు పరీక్ష మండల నోడల్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

దస్నాపూర్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వేమనపల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామంలో డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించి అనారోగ్యంతో ఉన్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. డ్రై డే నిర్వహించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, పంచాయతీ కార్యదర్శి యూసఫ్, రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త సుజాత పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో వినోద్ ఎన్నికల ప్రచారం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. మున్సిపాలిటీలోని 20, 21, 22వార్డుల్లో కలియ తిరిగి ఓటర్లను కలిశారు. మహిళలు, యువకులతో కలిసి వీధుల్లో ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా అమెరికాలో ఉన్న వినోద్ కూతురు వర్షతో సెల్‌ఫోన్‌లో మహిళలు మాట్లాడారు. బెల్లంపల్లికి ఎన్నికల ప్రచారానికి రావాలని కోరగా ఆమె అంగీకరించారు. ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వినోద్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఓటర్లు వర్షకు తెలిపారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

భీమిని: కన్నెపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. కన్నెపల్లి మండల నాయకుడు మాదవరపు నర్సింగరావు, మండల అధ్యక్షుడు రామాంజనేయ ఆధ్వర్యంలో కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గడ్డం వినోద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రుద్రభట్ల సంతోష్, హరీష్‌గౌడ్, బానేష్, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గడువు పెంచినా మారలె..!

- యూడైస్ నమోదులో అధికారుల అలసత్వం
- నేటితో ముగియనున్న గడువు
- నమోదు కాని విద్యార్థులకు నష్టమే
- యూనిఫాం, పాఠ్యపుస్తకాలు నష్టపోయే అవకాశం

ఓ పాఠశాలలో 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రత్యక్ష తరగతులకు 200 మంది హాజరవుతున్నా ఆన్‌లైన్‌లో మాత్రం 180మంది మాత్రమే కనిపిస్తున్నారు. మిగిలిన విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోవటంతో ప్రభుత్వం అందించే ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందకుండా పోయే అవకాశాలున్నాయి. ఈ లెక్కన 20మంది డ్రాప్‌బాక్స్‌లో మిగిలిపోయారు. ఐదు పాసై ఏదో ఒక్క స్కూల్లో చేరినా, ఆన్‌లైన్ నమోదు చేయకపోవటంతో డ్రాప్ బాక్స్‌లో కనిపిస్తుంటారు. జిల్లాలో మొత్తం ఈ నెల 2వరకు డ్రాప్ బాక్స్‌లో 10904మంది ఉన్నారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. విద్యాశాఖ నమోదును వేగవంతం చేయాలని ఆదేశిస్తున్నా ముందుకు సాగడం లేదు. గత నెల 28లోగా విద్యార్థుల నమోదు ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నా, సగం కూడా పూర్తికాలేదు. విద్యార్థుల వివరాలు పాఠశాలల హెచ్ఎంలు యూడైస్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంది. గడువు దాటితే నమోదుకు అవకాశం ఉండదని విద్యాశాఖ తేల్చిచెప్పినా పాఠశాలల యాజమాన్యాలు పెడచెవిన పెడుతున్నాయి. పొడిగించిన గడువు ఈ నెల 4న ముగియనుంది.

విద్యార్థుల వివరాల నమోదుతోనే..

యూడైస్ ప్లస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగానే 2024–25 విద్యా సంవత్సరంలో పిల్లలకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. హాజరుపుస్తకం (అటెండెన్స్ బుక్స్)లో నమోదైనా విద్యార్థి వివరాలన్నీ యూడైస్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల అలసత్వం.. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్లిప్తతతో యూడైస్ ప్లస్ నమోదు ప్రక్రియ వెనుకబడి పోతోందని తెలుస్తోంది.

ఆన్‌లైన్‌లో నమోదులో వెనుకబడి..

1 నుంచి 10వరకు డ్రాప్‌బాక్స్‌లో ఉన్న వివరాల ప్రకారం కొన్ని మండలాలు వెనుకబడిపోయాయి. 15రోజుల వ్యవధిలో పోల్చితే మంచిర్యాల, తాండూర్, కాసిపేట, నస్పూర్ మండలాలు వెనుకబడిపోయాయి. మంచిర్యాలలో గత నెల 19న 2199 మంది విద్యార్థులు డ్రాప్ బాక్స్‌లో ఉండగా ఈ నెల 3వరకు 413మంది, తాండూర్ 400మంది 101, కాసిపేట్‌లో 411లో 104, నస్పూర్‌లో 1197 మందిలో 305మంది విద్యార్థుల మాత్రమే ఆన్‌లైన్ నమోదు చేసి డ్రాప్‌బాక్స్ క్లియరెన్స్ చేశారు. బెల్లంపల్లి, నెన్నెల, చెన్నూర్ మండలాల్లో విద్యార్థుల ఆన్‌లైన్ నమోదు (డ్రాప్ బాక్స్ క్లియరెన్స్) చేసి ముందు వరుసలో నిలిచాయి.



యూడైస్ లోగో

యూడైస్ ఇలా..

విద్యార్థుల వివరాలు నమోదు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ యూడైస్ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ప్రతి పాఠశాలలో చదివే విద్యార్థుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. గతంలో నమోదైనా విద్యార్థుల వివరాలను అప్‌డేట్ చేయాలి. పాఠశాల నుంచి వెళ్లిపోయిన వారిని తొలగించి కొత్తగా చేరిన వారి సమాచారాన్ని ఎప్పటికప్పుడు పొందుపర్చాలి. పోర్టల్‌లో నమోదైనా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందించనున్నారు. పోర్టల్ నమోదుకు తేదీ ముగియనుండటంతో నమోదు కాని విద్యార్థుల పరిస్థితి ఏమిటో తెలియకుండా పోతోంది. మళ్లీ గడువు పెంచుతారా..? లేదా తెలియాల్సి ఉంది. ఈ నెల 2వరకు యూడైస్ పోర్టల్‌లో నమోదైనా వివరాలు ఇలా ఉన్నాయి. డ్రాప్‌బాక్స్‌లో 10,904మంది ఉన్నారు. అన్ని యాజమాన్యాలు రేపటిలోగా ఇన్‌పోర్ట్ ఆన్‌లైన్ జాయిన్ చేయించాలి. ఇంకోవైపు రెండు నుంచి 12వ తరగతి వరకు ఉన్న పిల్లలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. వచ్చే సంవత్సరం నుంచి ఒకటో తరగతికి మాత్రమే కొత్త ప్రవేశాలుంటాయి. మిగిలిన తరగతుల పిల్లలకు ఆన్‌లైన్ నమోదుకు అవకాశం ఉండదు. ఎస్ఎస్సీకి నామినల్ యూడైస్‌లో ఉన్న వివరాల ఆధారంగానే నామినల్ రోల్స్ క్రియేట్ చేయబడుతాయి. గడువు ముగిసేలోపు యూడైస్‌లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం



దండేపల్లిలో ఎమ్మెల్యే ప్రచారం



శ్రీరాంపూర్: ప్రచారం నిర్వహిస్తున్న విజిత్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కర్ణమామిడి, టీకానపల్లి గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఇంటింటా బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే పథకాలను వివరిస్తూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రచారం చేశారు. ప్రచారంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా బస్టాండ్ ప్రాంతంలో హోటళ్లు, కిరాణా దుకాణాలు, హేర్‌సెలూన్ షాపులు, ఇస్త్రీ షాపులకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. రోడ్డు పక్కన మొక్కజొన్న కంకులు అమ్ముతున్న ఓ మహిళ వద్దకు వెళ్లి కంకి కొనుగోలు చేసిన ఎమ్మెల్యే, కారుగుర్తుకే ఓటెయ్యాలని కోరారు. ప్రచారంలో డూప్ కేసీఆర్ రాజారమేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని కార్మికవాడల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 17వ వార్డుల్లో నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు ఇంటింటికీ తిరుగుతూ మంచిర్యాల గడ్డపై మరోసారి దివాకర్‌రావును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, టీబీజీకేఎస్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, డీ. అన్నయ్య, కౌన్సిలర్లు బడికే లక్ష్మి, మహేశ్, నాయకులు కమలాకర్‌రావు, రఫీక్‌ఖాన్, జక్కుల రాజేశం, శెట్టి రమణ, గుమ్మడి శ్రీనివాస్, బండి తిరుపతి, పంబాల ఎర్రయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి



అశోక్‌రోడ్డులో ప్రచారం చేస్తున్న సురేఖ

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందాలంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని 17వ వార్డు అశోక్‌రోడ్డులో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. మంచిర్యాల అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును భారీ మెజారిటీతో ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

దొనబండలో కాంగ్రెస్ ప్రచారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దొనబండలో గడపగడపకూ వెళ్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు గ్యారంటీ హామీలను ఇంటింటికీ వివరించారు. రానున్న ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావును ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రచారంలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో పాటు జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలతో అన్నివర్గాలకు లబ్ధి



పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

జన్నారం: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు గ్యారంటీ పథకాలతో రాష్ట్రంలో అన్ని వర్గాలకు లబ్ధి జరుగుతుందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ అన్నారు. మండలంలోని మన్నెగూడ, అక్కపెల్లి గూడ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు రైతుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఒకే దఫా రూ.2లక్షలు రుణమాఫీ చేస్తారని, సంవత్సరానికి రూ.15వేలు పెట్టుబడి సాయం అందించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. రైతులు, నిరుద్యోగులు, యువకులను బీఆర్ఎస్ పాలకులు మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు అజ్మత్‌ఖాన్, అఖిల్, రాకేశ్‌సాయి, రఘువర్దన్, సమీత్, గణేశ్, తరుణ్, బన్ని, రాజేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- మంచిర్యాల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘునాథ్‌రావు

నస్పూర్: రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మంచిర్యాల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్‌రావు అన్నారు. పట్టణంలోని విలేజ్ నస్పూర్‌లో శుక్రవారం ఆయన ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనలో గత ఎమ్మెల్యే దివాకర్‌రావు విఫలమయ్యారని విమర్శించారు. బీజేపీకి ఒక్క అవకాశం ఇస్తే పట్టణంలో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగారావు, పట్టణ కన్వీనర్ సత్రం రమేశ్, జిల్లా మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాషా, పట్టణ ప్రధాన కార్యదర్శి ఈర్ల సధానందం, నాయకులు కుర్రె చక్రి, సిరికొండ రాజు, సాగర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ రాజయ్యకు కండువా కప్పుతున్న మంచిర్యాల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘునాథ్‌రావు

బీజేపీలో చేరిన అల్లీపూర్ సర్పంచ్

దండేపల్లి: మండలంలోని అల్లీపూర్‌కు చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ కొత్తపెల్లి రాజయ్య, వార్డు సభ్యుడు సత్తయ్య, నాయకుడు చిరంజీవి శుక్రవారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాల నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రఘునాథ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు కొర్విచెల్మకు చెందిన రాజశేఖర్, గీత, తదితరులు కూడా బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని బాల్క సుమన్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న లంబాడీలు

భీమారం: మండల కేంద్రంలోని లంబాడీతాండాలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ప్రభుత్వవిప్ బాల్కసుమన్‌కు వినతిపత్రం అందజేశారు. మురుగుకాలువల సమస్యతో తాము నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షాకాలంలో వరదనీళ్లు వెళ్లేందుకు దారి లేక ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మించాలని సుమన్ దృష్టికి తీసుకెళ్లారు. దళితబంధు లాగే గిరిజనబంధు అమలు చేయాలని కోరారు.

పోటాపోటీగా చేరికలు

వేమనపల్లి: మండలంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఆయా పార్టీల వారు గ్రామానికి వెళ్లి యువతను పార్టీలోకి చేర్చుకుంటుండగా, మరోపార్టీ వారు మరో వర్గాన్ని చేర్చుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వేణుమాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం సుంపుటం, జాజులపేట గ్రామాల్లోని యువకులు బీఆర్ఎస్‌లో చేరగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు నీల్వాయి ఎంపీటీసీ సంతోష్ ఆధ్వర్యంలో మరో వర్గం అదే గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న యువకులు



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ యువకులు

10న జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు ఈ నెల 10న నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం, ఉప అంశంగా పర్యావరణ వ్యవస్థను తెలుసుకోవడం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు, స్వీయ విశ్వాసం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం తదితర అంశాలపై పోటీలు ఉంటాయని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబును సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

కోటపల్లి: విద్యార్థులు ఇష్టపడి ఉన్నతంగా ఎదగాలని డీఈవో యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కోటపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, పార్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించి పాఠశాలల్లో జరిగే స్వీస్ పరీక్షలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పది విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుపతిరెడ్డి, కస్తూర్బాగాంధీ ఎస్‌వో హరిత, హెచ్ఎం యోగేశ్వర్ పాల్గొన్నారు.



కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

సురేఖకు మహిళల మద్దతు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును గెలిపించాలని ఆయన సతీమణి, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రచారంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మహిళలు

■ బొగ్గుబాయి వార్తలు

సీహెచ్‌పీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సీహెచ్‌పీలో నెలకొన్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ అన్నారు. సీహెచ్‌పీని శుక్రవారం సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీహెచ్‌పీలో వాటర్ ట్యాంకర్ లేని కారణంగా దుమ్ముధూళితో కార్మికులే కాకుండా చుట్టుప్రక్కల ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మ్యాన్‌పవర్ తక్కువగా ఉన్నందునా కార్మికులపై పనిభారం పడుతుందని, వెంటనే సరిపడా సిబ్బందిని నియమించాలన్నారు. కార్మికులందరికీ సమానంగా ప్లేడేలు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హరిరామకృష్ణ, కృష్ణస్వామి, సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

ఐఎన్టీయూసీలో చేరిక

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ మాజీ నాయకులు ఇద్దరు ఐఎన్టీయూసీలో చేరారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన ఐఎన్టీయూసీ సమావేశంలో శ్రీరాంపూర్ సీహెచ్‌పీ మాజీ ఫిట్ సెక్రెటరీ సమ్మిరెడ్డి, ఎస్సార్పీ 1గని మాజీ ఫిట్ సెక్రెటరీ కొలిపాక సమ్మయ్యలు ఐఎన్టీయూసీలో చేరారు. వీరికి ఆ యూనియన్ సెక్రెటరీ జనరల్ ప్రసాద్ కండువా కప్పి యూనియన్‌లోకి స్వాగతం పలికారు. యూనియన్‌లో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే వచ్చే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలుపించుకోవాలన్నారు. రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రి వద్ద ఆర్కే 7గనిలో మృతి చెందిన వెంకటేశ్ కుటుంబ సభ్యులను నేతలు పరామర్శించారు. ఘటనను తీవ్రంగా ఖండించారు. కంపెనీ నిర్లక్ష్యం వల్లే ఇలాంటి మరణాలు సంభవిస్తున్నాయని వారు తెలిపారు.

నిందితులకు జరిమానా

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు మంచిర్యాల న్యాయమూర్తి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అర్పితా మారం రెడ్డి రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... చందారం గ్రామానికి చెందిన అన్నం శేఖర్, అన్నం వెంకటేష్‌లు 2021లో పొలం వద్ద కాలువ నీళ్ల కోసం అదే గ్రామానికి చెందిన అన్నం సంతోష్‌తో గొడవపడి పారతో కొట్టి గాయపరిచారు. దీంతో సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై నిందితులపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపర్చగా సాక్ష్యాదారాలు ప్రవేశపెట్టడంతో నేరం రుజువైనందునా నిందితులిద్దరికి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

చెన్నూర్‌కు బస్సు నడిపించాలి


జైపూర్: పెద్దపల్లి జిల్లా మంథని ఆర్టీసీ బస్సు డిపో నుంచి మంచిర్యాల జిల్లా రొమ్మిపూర్ సమీపంలో ఉన్న పార్వతి(సుందిళ్ల) బ్యారేజీ మీదుగా చెన్నూర్‌కు బస్సు నడిపించాలని మండల ప్రజాప్రతినిధులు శుక్రవారం డీఎంకు వినతిపత్రం అందజేశారు. శివ్వారం, పొనూర్, వేలాల, కిష్టాపూర్, కుందారం గ్రామాల సర్పంచ్‌లు డిపో మేనేజర్, రీజినల్ మేనేజర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్‌కు వినతిపత్రాలు అందజేసినట్లుగా పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు సేవలు లేక గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆవిడపు గణేశ్, సారయ్య, నాయకులు శ్రీకాంత్, లక్ష్మణ్, పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

'పార్టీ కోసం పనిచేసినా గుర్తింపు లేదు'

భీమారం: కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం ఉద్యోగానికి రాజీనామా చేసినా అధిష్టానం పట్టించుకోలేదని ఆ పార్టీ నుంచి చెన్నూరు అభ్యర్థిగా టికెట్ ఆశించిన రాజారమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యులతో భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగం వదులుకొని రాజకీయాల్లోకి వచ్చి కాంగ్రెస్ పార్టీపై అభిమానంతో చేరినట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నిర్ణయం మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. పార్టీ నాయకులు లాజర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన రాజారమేశ్